అవగాహన లేక మూర్ఖంగా ప్రవర్తించినా వాళ్ళు నిన్ను కనిపెంచినవాళ్ళు. వాళ్ళను పోషించుట నీ బాధ్యత. ప్రేమ పెళ్ళిళ్ళు సఫలమవడానికి ఒకరినొకరు పరస్పరం అర్థం చేసుకోవడం, ఆర్థిక స్వాతంత్ర్యం కారణాలౌతాయి. నీ పెళ్ళి విజయవంత మవడానికి ముఖ్యంగా నీవు ఆర్థికంగా సర్వస్వతంత్రుడవవడమే కారణం. ఏ ఉద్యోగం లేకున్నా, వేరే ఆదాయం లేకున్నా రమణ పెళ్ళిచేసుకున్నాడు. ఇద్దరివద్ద ఉన్న డబ్బయిపోయేంతవరకు అన్యోన్యంగానే ఉన్నారు. తర్వాత ఏం చేస్తారు, ప్రేమను తిని బ్రతుకలేరుకదా! ఇటు ఉద్యోగంలేదు. ఇక వాళ్ల కాపురా లెలా నిలుస్తాయి? పెళ్ళి విఫలానికి పరిస్థితికూడా కారణమౌతుంది. రమణనుచూచి అన్ని పెళ్లిళ్లిలాగే ఉంటాయనుకోరాదు. సరిగా ఆలోచించి తమను తాము పోషించుకునే స్థితిలో ఉంటే ఇది తప్పకుండా విజయవంతం ఔతాయి. వీటివల్ల సంఘాన్ని పీడిస్తున్న వరకట్న దురాచారం, కులమత విభేదాలనుకూడా కొంత వరకు నిర్లక్ష్యం చేయువచ్చు.

మీ మిత్రుడు,
శేఖర్.

(అరుణరేఖ- డిసంబర్ 83)

# 11. మేడిపండు

అది ఆంధ్రదేశంలోని పల్లె, పట్నంకాని ఒక కాలనీ. పేరు సమతానగర్. దేశంలోనున్న వంట నూనెల కొరత

తీర్చడానికై అత్యాధునిక టెక్నాలజీ నుపయోగించి తౌడు నుండి నూనెనుతీసే ఫ్యాక్టరీ కార్మికులకొరకై అది నిర్మించ బడింది. ఆంధ్రదేశం వరిపంటుకు ప్రసిద్ధి అవడ వల్లనూ, ఆ ప్రదేశంలో వరిపంటు బాగా పండటంవల్లనూ, అచ్చట రైస్ మిల్లులు అధికంగా ఉండి ముడిసరుకైన తవుడు విరివిగా లభించడంవల్లనూ, ఆప్రదేశం ఎన్నుకోబడింది. ఇసుకనుండి తైలంతీసే ఫ్యాక్టరీనుండి వచ్చిన కొంతమంది అనుభవజ్ఞులైన ఆఫీసర్లు తప్ప ఆ ఫ్యాక్టరీలో పనిచేసే వాళ్ళంతా 20_30 సం॥ల మధ్య వయస్సుగల నవయువకులే. అందులో పని చేసే కార్మికుల కనీస విద్యార్హత డిగ్రీ. అందులోని ప్రతి ఉద్యోగి జీతము నాలుగంకెలు దాటే ఉంటుంది. అందులోని ఉద్యోగుల ఆదాయంకాని, చదువుకాని, భారతదేశంలోని సగటు మనిషి ఆదాయంకంటే మరియు విద్యకంటే చాలా ఎక్కువ. ఆ కాలనీలోని వీధులన్నీ సిమెంటు రోడ్లు మయమై కాలికి బురద అంటాల్సిన అవసరం లేకుండా ఉన్నవి. కాల నీలోని అన్ని రోడ్ల వెంబడి ట్యూబులైట్లు దేదీప్యమానంగా వెలుగుతూ రాత్రి పగలు తేడా లేకుండా చేస్తాయి. ఆకాలనీ లోని ప్రతి ఇంటిలోను ఆధునిక విజ్ఞానం ప్రసాదించిన టి.వి, టేప్ రికార్డర్ అధునాతన ఫర్నీచర్, ఫ్రిడ్జి- తప్పకుండా వుంటాయి. మెజారిటి కార్మికులు స్కూటర్ మెయిన్‌టెన్ చేస్తారు. అట్టి అధునాతన టెక్నాలజీతో నడుపబడుతున్న ఫ్యాక్టరీలో మెజారిటీగా వున్న నవయువకులతో కలిసి పనిచేసే

అవకాశం లభించినందుకు సుధాకర్ చాలా సంతోషించాడు. సైన్సు ప్రసాదించిన సౌకర్యాలతో జీవితాలను స్వర్గతుల్యం చేసికొంటున్న నేటి యువతరంలో అభ్యుదయ భావాలే తప్ప మూఢ నమ్మకాలు, అర్థంలేని కులమత విద్వేషాలకు తావుండదనుకున్నాడు. అతడు జాయిన్ అయిన కొత్తలో యువకులంతా ఆదర్శాలు వల్లిస్తూ కలిసికట్టుగా పనిజేయడం గమనించిన సుధాకర్, ఆ కాలనీకి "సమతానగర్" అన్న పేరు సరియైనదేనని భావించాడు. ఆ ఫ్యాక్టరీలో ఉద్యోగం లభించినందుకాతడు ఎంతో పొంగిపోయాడు.

షాపింగ్‌సెంటర్‌లో గుమిగూడియున్న గుంపులోనుండి సంభాషణలు జోరుగా వినవస్తున్నాయి. మెల్లమెల్లగా సాగిన సంభాషణ క్రమక్రమంగా వేడి పుంజుకొంటున్నది.

హిందూ మతం సర్వ మతాల కూడలి. హిందూమతానికున్న ఔన్నత్యం ఏ మతానికిలేదు. ఇది చాలా పురాతనమైనది. ఇస్లాం, క్రైస్తవ మతాలు మధ్యలో పుట్టినవి. సంకుచితమైనవి_" ఒక శాస్త్రి వాదించాడు.

"అన్నిటికంటె ఇస్లాం మతం గొప్పది. అది నిరాడంబరతకు పెట్టింది పేరు. ఇస్లాంలో ఉన్న నీతి నియమాలు ఎందులోనూలేవు. ఎప్పుడో ఒకనాటికి అన్నిమతాలు నశించి ఇస్లామ్‌లో కలుస్తాయి-" ఒక ఖాన్ వాదన.

హిందూ, ముస్లిం రెండు మతాలూ అభివృద్ధి నిరోధకమూ, సంకుచితమైనవే. క్రిస్టియానిటి ఒక్కటే ప్రపంచ

వ్యాపితమైంది. మిగతా మతాలన్నీ క్రైస్తవ మతంలో విలీనంకాక తప్పదు-" జాన్ వాదించాడు.

మా మతమంటే మామతం గొప్పదని మూడుమతాల వాళ్ళూ ఘర్షణకుదిగారు. మీరు మూర్ఖులంటే మీరు మూర్ఖులని ఒకరిపై ఒకరు తోసుకున్నారు. షాపింగ్ సెంటర్ కురుక్షేత్రంగా మారింది. చేతికి దొరికిన వస్తువును ఒకరిపై ఒకరు విసురుకున్నారు. నలుగురైదుగురు హాస్పిటల్ పాల య్యారు. శర్మ, సయ్యద్, విల్లియంలను హాస్పిటల్‌లో ప్రక్కప్రక్క మంచాలలో పడుకోబెట్టారు. ముగ్గురికీ రక్తం అవసరమొచ్చింది. అక్కడికొచ్చిన కొందరు ఉద్యోగుల రక్తాన్ని పరీక్షించి వాళ్ళకు ఎక్కించారు. కొద్ది రోజులలో వాళ్లు కోలుకున్నారు. వాళ్లను చూడటానికి వచ్చిన సుధాకర్ "శర్మ, సయ్యద్, విలియం మీరు ముగ్గురూ మూడు మతాలను రిప్రజెంట్ చేస్తారుకదా. మీ అందరిలో ఉన్న రక్తం ఒక్కటే. శర్మకు ఒక క్రైస్తవుడి రక్తం, సయ్యద్‌కు ఒక హిందూరక్తం, విలియంకు ఒక ముస్లింరక్తం ఎక్కించ బడింది. ఇప్పుడు చెప్పండి ఎవరి రక్తం గొప్పదో? ఒక మతస్థుడి ప్రాణాలను నిలబెట్టడానికి వేరొక మతస్థుడి రక్తం అవసరమొచ్చింది. ప్రాణాలు నిలిపే రక్తంలోనే తేడా లేనపుడు మూర్ఖంగా మామతం గొప్పదంటే- మామతం గొప్పదని తన్నుకోవడం హేయమైనపని-" అని ముగ్గురివైపూ చూసాడు. ముగ్గురు తలలు వంచుకున్నారు. ఐనా కొన్ని

రోజులతర్వాత మళ్ళీ మామూలే.

హడావిడిగా పోతున్న అనిల్ యాదవ్‌ను అడిగాడు సుధాకర్ "ఎక్కడికోయ్? అంత గాభరాగా పరుగెడుతు న్నావ్?" "మా Caste Association Election ఉంది. 7-30 కి టైమిచ్చారు. 7-00 అయింది. అందుకే తొందరగా పోతున్నాను" అన్నాడు అనిల్. ఈ మాటలువిన్న సుధాకర్ అవాక్కయాడు. తమ స్వార్థ ప్రయోజనాలకొరకు అమా యకులను రెచ్చగొట్టి కులంపేర సంఘాలను ఏర్పాటుచేసే అభివృద్ధి నిరోధకుల నేమనాలో అతనికి తోచలేదు. "మీ కులసంఘంపెట్టి ఏంసాధించాలని మీఉద్దేశ్యం?" అన్నాడు. "మా కులంవారికి చాలా అన్యాయం జరుగుతుంది. అప్పా యింటుమెంట్లలో, ప్రమోషన్‌లలో, మరెన్నింటిలోనో— అందుకే సంఘం తరపున కలసికట్టుగా పోరాడి మాకు న్యాయం జరిగేలా చూస్తాము" అన్నాడు అనిల్‌యాదవ్. "ఈ అణుయుగంలోకూడా ఇంకా ఎందుకోయ్ కులాలను పట్టుకు వేళ్ళాడుతారు? కులం సంఘాలంత అభివృద్ధినిరోధ కము వేరే ఏముందోయ్?" అన్నాడు. "నువ్వలాగే అంటావు. ఈ సమతానగర్‌లో ప్రతి కులానికి సంఘముంది. బ్రాహ్మణ సంఘం, వైశ్యసంఘం, పద్మశాలి సంఘం, కమ్మ సంఘం, ఎస్. సి. సంఘం, రెడ్డి సంఘం, బి. సి. సంఘం. ఇన్ని సంఘాలున్నపుడు మేంమాత్రం సంఘాన్నెందుకు పెట్టుకో కూడదు? అందరూ తమతమ కులాలపేరుమీద లాభాలు

పొందుతుంటే మేమెందుకు మడిగట్టుకు కూర్చోవాలి?" అన్నాడు అనిల్.

ఆ మాటలన్నీ విన్న సుధాకర్ అవాక్కయాడు. తన కింతవరకూ సమతానగర్‌లో ఇన్ని సంకుచిత సంస్థా లున్నట్లు తెలియదు. ఆధునిక విజ్ఞానంతో ప్రపంచం సృష్టికి ప్రతిసృష్టి చేయు స్థితికి చేరుకుంటున్న నేటి యుగంలో ఇంకా విద్యాధికులై కూడా వీళ్లు మూర్ఖంగా కాలాన్ని వేల సంవత్స రాల వెనక్కి ఎందుకు తీసుకుపోతున్నారో అర్థంకాలేదు. అనిల్ కేంచెప్పాలో తోచక "సరేలే- నీవుకూడా హడావి డిగా ఉన్నావు పో" అన్నాడు.

నిమ్మకాయలు, పసుపుకుంకుమతో అలంకరింపబడిన ఒక స్నేహితుడి స్కూటర్‌ను చూసి సుధాకర్ అదేమిటని ప్రశ్నించాడు.

"క్రొత్తస్కూటర్ కదా! వాహనపూజచేయించాను" అన్నా డామిత్రుడు. "పూజచేయడంలో నీ ఉద్దేశ్యం?" ప్రశ్నిం చాడు సుధాకర్. "ప్రమాదాలవీ జరుగకుండా దుష్టశక్తు లను సంతృప్తి పరచడానికి.

నిమ్మకాయలు, కొబ్బరికాయలు, అగరువత్తుల పూజలు ప్రమాదాల నాపినచో ఈ దేశంలో ప్రమాదాలనేవి మచ్చుకు లేకుండా ఉండేవి. ఇదంతా చాదస్తంకాక మరేమిటోయ్? ఐనా సుముహూర్తంలో అయిదు కొబ్బరికాయలతో, ఆరు నిమ్మకాయలతో పకడ్బందీగా పూజచేయించిన రామంకు

స్కూటర్ ఆక్సిడెంటు ఎలాజరిగింది?" అన్నాడు సుధాకర్.

"నీవలాగే అంటావు. ఎవరి నమ్మకం వారిది. పూజ చేయకపోతే రామం మరణించేవాడేమో. ఇపుడు ఆక్సిడెంటు వల్ల ఒకచేయిమాత్రం పోగొట్టుకున్నాడు" అన్నాడుమిత్రుడు

ఆతని వితండవాదానికి, మూర్ఖత్వానికి నవ్వాలో ఏడ్వాలో తెలియలేదు సుధాకర్‌కు. హైయ్యర్ ఎడ్యుకేషన్ ఉండి మూఢాచారాలతో, సంకుచిత కులమత విద్వేషణలతో సతమతమైపోతున్న యువతరాన్ని ఎలాగైనా మార్చాలని సుధాకర్ ఎంతగానో ప్రయత్నించాడు. తనలాంటి అభ్యుదయవాదులైన కొందరు యువకులను ప్రోగుచేసి "సుభాష్ యువజన సంఘం" ను స్థాపించాడు. ప్రతి కులంవాళ్ళను మతంవాళ్ళను కలిసికొని సభలు ఎర్పాటుచేసాడు. ప్రగతి శీల భావాల నెన్నో నూరిపోసాడు.

"మతం అంటె ఇష్టం. అది ఒక జీవితపథాన్ని నిర్దేశిస్తుంది. ఏమతమైనా బోధించేది ఒకటే. ప్రాచీనకాలంలో మానవుడు తనకొక జీవిత పథాన్ని నిర్దేశించుకొంటూ మతాన్ని స్థాపించుకొన్నాడు. మానవ కల్పితాలైన ఈ మతాలకొరకు అధునాతన యుగంలోకూడా మనుషులు ఆటవికులవలె తగవులాడుతూ మారణహోమాన్ని సృష్టించడం ఎంత అమానుషం. కులాలన్నీ మానవ కల్పితాలు. మనిషిచేసే వృత్తులనుబట్టి అప్పుడు కుల విభజన జరిగింది. కాని అన్ని కులాలవారూ అన్ని పనులను చేస్తున్న ప్రస్తుత

తరుణంలో కులాల ప్రసక్తి ఎందుకు? భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పినదాన్నిబట్టికూడా ప్రస్తుత వ్యవస్థలో కులాలు అప్రస్తుతం "చాతుర్వర్ణ మయాసృష్ట్యా, గుణకర్మ విభాగః" అన్నాడు. అనగా గుణాన్నిబట్టి చేసే పనులను బట్టి కులవిభజన జరిగింది. ఆ విభజన ననుసరించి కూలిపనిచేసే బ్రాహ్మణుడైనా శూద్రుడనాలి. వ్యాపారంచేసే హరిజనుడైనా వైశ్యుడనాలి. అనగా కులాలు వృత్తులనుబట్టి విభజింపబడ్డాయేకాని, పుట్టుకతో వచ్చినవి కావు. వృత్తివిద్య అడుగంటిన ఈ కాలంలో కులాలనుబట్టి వ్రేలాడుట అమానుషం. వాటిని పెంచి పోషించుట అనాగరికం.

ప్రపంచ హేతువాద దృక్పథంతో, అణువిజ్ఞానంలో పురోగమిస్తున్న యీ తరుణంలో ఇంకా బూజుపట్టిన మూఢాచారాలను, కులమతాలను పట్టుక వ్రేలాడడం శుద్ధ దండగ. యువశక్తి అంతా సంఘటితమై సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను, అవినీతిని ఎదురొడ్డి పోరాడాలి. కుళ్ళిపోయిన కులమతవ్యవస్థ నిర్మూలనకై దీక్షబూని మానవులంతా ఒకటేననీ చాటాలి.

ఈవిధంగా ఎన్నో విధాలుగా నచ్చజెప్ప ప్రయత్నించాడు. కాని రోజురోజుకు కుల సంఘాలు, మత సంఘాలు ఎక్కువయ్యాయే కాని తగ్గలేదు. తప్పుదారి పడుతున్న యువతరాన్ని ఎలా మార్చాలో తెలియక సుధాకర్ జుట్టు పీక్కున్నాడు. కాలం గడుస్తున్నకొద్దీ యువకుల నిజస్వరూప

—కాలువ మల్లయ్య

బయటుపడసాగింది. నవ్యత, నాగరికత వాళ్ళ వేషభాషల్లో నేకాని ప్రవర్తనలో కాదని ఋజువు కాసాగింది. ఆధునిక విజ్ఞానం, హైయ్యర్ ఎడ్యుగేషన్ వాళ్ళ గుణగణాలలో ఏమాత్రం మార్పు తీసుకరాలేదని అతడు మెల్లమెల్లగా గ్రహించసాగాడు. సమతానగర్ అన్న పేరు ఆ కాలనీకి మేడిపండు లాంటిది మాత్రమేనని గ్రహించడానికి సుధాకర్‌కు ఎక్కువ కాలం పట్టలేదు. అయినా సుధాకర్ నిరాశజెందలేదు. ఆ కాలనీలోకి యువకులలో శాస్త్రీయ దృక్పథం కలుగజేయడానికై తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు.

# 12. రెడ్డిగారి వివాహ ప్రహసనం

మొదటినుంచీ రెడ్డిగారు అదో తరహా మనిషి. ప్రతి విషయాన్నిగూర్చి ధారాళంగా ఉపన్యసించేవారు. కాని ఏదీ చేసేవాడుకాదు. భారతదేశంలో ముష్టివాళ్ళు, పేదవాళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని లెక్చరిచ్చేవాడు. కాని వీధిలో బిచ్చగాడెదురైతే ఒక్కపైసా కూడ దానంచేసేవాడు కాదు. సినిమాల్లో శృంగారం తెగ చూపిస్తున్నారని సినిమావాళ్ళను తెగతిట్టేవాడు. కాని జయమాలిని లేని సినీమాకు ససేమిరా పోయేవాడుకాదు. వారు ఏపార్టీకి చెందినవారో తెలిసికోవడం బ్రహ్మతరంకూడకాదు. ఆర్. ఎస్. ఎస్. వాళ్ళతో స్వయంసేవక్‌ననీ, కాంగ్రెస్‌వాళ్ళ